ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 13 మే 2025



నిషేధిత జాబితా నుంచి
మా భూములు తొలగించండి
కలెక్టర్‌కు ఆవులపల్లె రైతుల వినతి

పుంగనూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తమ భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని సోమల మండలం ఆవులపల్లె రైతులు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు విన్నవించారు.చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఆవులపల్లె పంచాయతీకి చెందిన ఆవులపల్లె, బయ్యారెడ్డిపల్లె, చిన్నదేవళకుప్పం, పెద్దదేవళకుప్పం, మల్లేశ్వరం, రామకృష్ణాపురానికి చెందిన 50మంది రైతులను భూసమస్యపై విచారించారు. వివరాల్లోకి వెళితే...వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణం చేపట్టగా రైతులు, ప్రజలు అడ్డుకున్నారు. సీతమ్మ చెరువును కూల్చి రిజర్వాయర్ నిర్మించడం వల్ల గ్రామాలు, పొలాలు, తోటలు మునిగిపోతాయని, కొంత వెనుకప్రాంతంలో కావాల్సిన ప్రభుత్వ భూమి ఉందని చెప్పినా వినకపోవడంతో ఎన్జీటీలో ఫిర్యాదు చేశారు.ఎన్జీటీ అభ్యంతరాలు లేవనెత్తడంతో కాంట్రాక్టర్ అయిన పీఎల్ఆర్ సంస్థ పనులు ఆపేసింది. కాంట్రాక్ట్ పని అర్ధంతరంగా ఆగడంతో కక్షగట్టిన అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి 55మంది రైతులకు చెందిన భూములను సర్వే నెంబరు 33 నుంచి 76 వరకు 911.44 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిగా మార్పు చేసి 22ఏ నిషేదిత జాబితాలో పెట్టారు.ప్రభుత్వం మారాక పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ద్వారా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వారికి జరిగిన అన్యాయం గురించి వివరించారు.ఆయన ఈ విషయంలో న్యాయం చేయాలని కలెక్టర్‌కు సూచించడంతో బాధిత రైతులకు సంబంధించిన భూముల రికార్డులు, ఆధారాలు తీసుకురావాలని చెప్పడంతో సోమవారం సాయంత్రం చిత్తూరు వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. తమ బాధ చెప్పుకుని ఆధారాలిచ్చి న్యాయం చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు. తమ భూములు అటవీశాఖవని రికార్డులు మార్చడంతో పంటసాగుకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదని వివరించారు. పూర్తి వివరాలతో నివేదిక విజయవాడ సీసీఎల్ఏ కమిషనర్‌కు పంపుతానని, అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే అర్హులైన రైతులకు 10వన్, అడంగల్ వస్తాయని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రైతులు చెప్పారు. గతంలో తమగోడు వినేవారే కరువయ్యారని, ప్రస్తుతం మంత్రి ఆదేశాలతో కలెక్టర్ న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

12మందితో కడా సలహామండలి

కుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడా)కి సలహామండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా 12మందితో ఏర్పాటు చేసిన కడా సలహామండలి పొలిటికల్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్‌గా కడా పీడీ వికాస్ మర్మత్ నియమితులయ్యారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేష్ బాబు, పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, మల్లానూరు క్లస్టర్ ఇంచార్జి రామచంద్ర, శెట్టిపల్లె యూనిట్ ఇంచార్జి టి.వెంకటేష్, 163వ బూత్ ఇంచార్జి సతీష్, చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు సుగుణమ్మ, ముద్దనపల్లె గ్రామ పార్టీ అధ్యక్షుడు రఘుపతి కడా సలహామండలి సభ్యులుగా వున్నారు. వీరితోపాటు కుప్పం ఆర్డీవో శ్రీనివాసులురాజు, కడా అడిషనల్ పీడీ (ఇంకా పోస్టు భర్తీ చేయలేదు)లను సైతం ఈ కమిటీలో సభ్యులుగా చేర్చారు.

నగరిలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత

చిత్తూరు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. సోమవారం నగరి మండలంలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా.. శ్రీరంగరాజపురంలో 39.6, గుడిపాలలో 39.2, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పంలో 37.1, తవణంపల్లెలో 37, చిత్తూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో 36.7, బంగారుపాళ్యంలో 36.5, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, యాదమరిలో 35.9, కార్వేటినగరంలో 35.8, గుడుపల్లె, కుప్పంలో 35.4, గంగవరం, పెద్దపంజాణిలో 35, శాంతిపురం, సదుంలో 34.7, బైరెడ్డిపల్లె, సోమల, వి.కోటలో 34.6, రొంపిచెర్లలో 34.4, పలమనేరులో 34.3, పుంగనూరులో 33.4, రామకుప్పంలో 33.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రూ.24 కోట్లతో 6 సబ్‌స్టేషన్ల మంజూరు

చిత్తూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెరుగైన విద్యుత్ సరఫరాకు ఆరు సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. చిత్తూరు నగరం, పెద్దపంజాణి, శాంతిపురం, యాదమరి, గుడిపాల, తవణంపల్లె మండలాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4 కోట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు.



కృష్ణమ్మ పరవళ్లు తొక్కేలా..

రాయలసీమ ప్రాంతానికి జీవనాడి అయిన హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా జూలై 10వ తేదీన నీళ్లను విడుదల చేస్తాం. ప్రాజెక్టులో ఫేజ్-1, ఫేజ్-2 కింద చేపడుతున్న 554 కిలోమీటర్ల కాలువ లైనింగ్, వెడల్పు పనుల కోసం ప్రభుత్వం రూ.3873 కోట్లు ఖర్చు చేయనుంది.

- రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు అనంతపురం జిల్లా చాయాపురంలో హంద్రీనీవా పనుల్ని పరిశీలించిన అనంతరం చెప్పిన మాటలివి.



- శరవేగంగా పీబీసీ, కేబీసీ కాంక్రీట్ లైనింగ్ పనులు
- జూలైలో నీళ్లు ఇస్తామంటున్న సీఎం చంద్రబాబు

చిత్తూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాయలసీమకు వరప్రదాయని అయిన హంద్రీనీవాకు పెద్దఎత్తున నిధులు కేటాయించడంతో కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.జూలైలో హంద్రీనీవా నీళ్లను విడుదల చేస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించడం జిల్లా రైతులకు, ప్రజలకు ఎంతో ఊరట కలిగించే అంశం.కుప్పం బ్రాంచి కెనాల్ పనులు 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేటప్పటికే 90 శాతానికిపైగా పూర్తయ్యాయి.మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయకుండా చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కుప్పంలో హంద్రీనీవా నీళ్లను వదులుతున్నట్లు స్టంట్ నడిపి నవ్వులపాలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు హంద్రీనీవా మీద ప్రత్యేక దృష్టి సారించారు. సీఎంగా తొలిసారి కుప్పానికి వచ్చిన ఆయన, వెంటనే హంద్రీనీవా కాలువను పరిశీలించారు. మిగిలిన 10 శాతం పనుల్ని పూర్తి చేయించేశారు.

● 70 శాతానికిపైగా కుప్పం లైనింగ్ పనుల పూర్తి

కుప్పం కెనాల్ పనులు సుమారు 70 శాతం, పుంగనూరు పనులు 30 శాతానికి పైగా పూర్తయ్యాయి. కుప్పం పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యం ఉన్నా.. క్షేత్రస్థాయి పరిస్థితుల దృష్ట్యా జూన్ ఆఖరు వరకు సమయం పట్టొచ్చు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే సీఎం చంద్రబాబు జూలై 10వ తేదీన నీళ్లను ప్రారంభిస్తానని ప్రకటించారు.

● లైనింగ్ పనుల కోసం రూ.516 కోట్లు

కుప్పం బ్రాంచి కెనాల్ పనుల్ని వంద శాతం పూర్తి చేయడంతో పాటు కుప్పం, పుంగనూరు బ్రాంచి కాలువలకు కాంక్రీట్ లైనింగ్ కోసం గతేడాది డిసెంబరులో ప్రభుత్వం పెద్దఎత్తున నిధుల్ని మంజూరు చేసింది. పుంగనూరు కెనాల్‌కు రూ.319 కోట్లు, కుప్పం కెనాల్‌కు రూ.197 కోట్లను కేటాయించగా.. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. లైనింగ్ పనులు పూర్తయితే వంద శాతం నీళ్లు చివరి వరకు చేరుతాయి. లేకుంటే 50 శాతం నీళ్లను కాలువ వెంబడి భూమి పీల్చుకుంటుంది.

16న మంత్రి నిమ్మల పర్యటన

సీఎం చంద్రబాబు హంద్రీనీవా పనులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పర్యవేక్షణ బాధ్యత జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి అప్పగించారు. గతేడాది సెప్టెంబరులో ఆయన మదనపల్లె, కుప్పం ప్రాంతాల్లోని హంద్రీనీవా కాలువల్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులతో సమీక్షలు నిర్వహించారు. మరోసారి నిమ్మల అనంతపురం నుంచి కుప్పం వరకు హంద్రీనీవా కాలువల్ని పరిశీలించేందుకు రానున్నారు. ఈ నెల 16న ఆయన కుప్పంలో బ్రాంచి కెనాల్ పనుల్ని పరిశీలించనున్నారు.

బడ్జెట్‌లో కేటాయించిన నిధులు
రూ.1,867 కోట్లు
పుంగనూరు బ్రాంచి కాలువ
ఆయకట్టు: 37,300 ఎకరాలు
నిండే చెరువులు: 125
కుప్పం బ్రాంచి కాలువ ఆయకట్టు:
6,300 ఎకరాలు
నిండే చెరువులు: 110

● కుప్పం రైతులకు తొలగనున్న కన్నీళ్లు

కుప్పం నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు, చెరువులు, పంటలు ఎండిపోయాయి. ముఖ్యంగా గుడుపల్లె మండలంలో 58 మీటర్ల లోతులో భూగర్భజలాలుండడం అత్యంత ప్రమాదకర పరిస్థితులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ భావిస్తున్నారు. భూగర్భజలాలు పెరిగేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కుప్పం బ్రాంచి కెనాల్ కుప్పం నియోజకవర్గంలోని 110 చెరువుల్ని నింపుతుంది. జూలైలో నీళ్లను వదిలితే కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని చెరువులన్నీ నిండి.. భూగర్భజలాలు పెరుగుతాయి. రైతుల కన్నీళ్లు తొలగుతాయి.



బజారువీధిలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు - నడివీధి గంగమ్మ (ఫైల్ ఫోటో)



గంగజాతర ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని బజారువీధిలో రెండ్రోజులపాటు నిర్వహించే నడివీధి గంగజాతర మంగళవారం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేకువజామున జాతర నిర్వహణ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే బాబు, హేమంత్ కుమార్ అమ్మవారికి తొలి పూజ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం అమ్మవారికి మహాకుంభ నైవేద్యాన్ని భక్తులు సమర్పించనున్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసింది. నగర పాలక సిబ్బంది పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు రాములగుడి వీధి దగ్గర చిత్తూరు జైన్ సంఘ కార్యాలయం వద్ద మజ్జిగ కేంద్రాన్ని సీకే బాబు ప్రారంభించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. 11 గంటలకు పొన్నియమ్మ గుడి వద్ద అన్నదానం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా.. గిరింపేట, కొంగారెడ్డిపల్లె, మురకంబట్టు, దొడ్డిపల్లె, మంగసముద్రం, మంగసముద్రం హౌసింగ్ కాలనీ, సంతపేట, ఓబనపల్లె, మురకంబట్టు బైపాస్ రోడ్ ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లోనూ గంగమ్మ జాతరలు నిర్వహించనున్నారు.



గంగమ్మ ఆర్చి

అమ్మవారిని దర్శించుకోనున్న ఇన్‌చార్జి మంత్రి

చిత్తూరు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి మంగళవారం గంగమ్మను దర్శించుకోనున్నారు. 8 గంటలకు చిత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చేరుకునే ఆయన అధికార, అనధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. 9గంటలకు బజారువీధిలో ఏర్పాటు చేసిన నడివీధి గంగమ్మను దర్శించుకుంటారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రాయచోటికి బయలుదేరి వెళ్తారు.

తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై
సస్పెన్షన్ వేటు



చిత్తూరు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టిన తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 నీరజను శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ గిరి బాబు సోమవారం తెలిపారు. తిరుపతి శివజ్యోతి నగర్‌లోని ప్రధాన మార్గానికి ఉన్న భవన స్థల అక్రమ రిజిస్ట్రేషన్ ఈ ఏడాది ప్రారంభంలో జరిగింది. రోడ్డుకు అనుబంధంగా ఉన్న కొన్ని గజాల స్థలాన్ని కాకుండా అదే భవనంలోని మిగిలిన కొంత స్థలాన్ని రెసిడెన్షియల్ పరిధి కింద సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనల మేరకు ఆ స్థలం మొత్తాన్ని కమర్షియల్‌గా చూపించాల్సి ఉండగా, రెసిడెన్షియల్ పరిధిలో చూపి తక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేశారు. దీనివల్ల రూ.82 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఈ రిజిస్ట్రేషన్‌పై అందిన ఫిర్యాదు మేర మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ డీఆర్ (ఏవీ ఏడీఆర్) మునిశంకరయ్య క్షేత్రస్థాయి పరిశీలన చేసి సబ్‌రిజిస్ట్రార్-1 నీరజ చేసిన అక్రమం నిజమేనని నిర్ధారించారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీకి నివేదిక అందజేశారు. దాంతో ఆమెను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించేవరకు తిరుపతి ఆర్వోలో పనిచేస్తున్న జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మీదేవి జాయింట్-1గా కొనసాగుతూ రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహిస్తారని డీఐజీ పేర్కొన్నారు.ఇటీవలే పీలేరు నుంచి బదిలీపై వచ్చి తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్న ఆమె ఆడిట్ తనిఖీలో అడ్డంగా దొరికిపోయి కొన్ని రోజులుగా సెలవులో వున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్‌లో 3,207 మంది విద్యార్థులకు 3,020 మంది హాజరవగా, 187 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 2,952 మందికి 2,797 మంది, ఒకేషనల్‌లో 255 మందికి 223 మంది హాజరయ్యారు. అలాగే సెకండియర్‌లో 826 మందికి 768 మంది, జనరల్‌లో 683 మందికి 637 మంది, ఒకేషనల్‌లో 143 మందికి 131 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, చిత్తూరు నగరంలో పీఎస్ఎన్ శ్రీవివేకానంద, విజయం, సాంఘిక సంక్షేమ గురుకుల, బీఎస్‌కన్నన్, కృష్ణవేణి, పీసీఆర్, ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను డీఐఈవో పరిశీలించారు. జిల్లా ప్రత్యేక అధికారి దయానంద రాజు, కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, శరశ్చంద్రశేఖర్‌లు 11 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 21 కేంద్రాలను పరిశీలించింది.



చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం ముందు విద్యార్థుల సందడి

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్లు : డీఈవో

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు సోమవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఫెయిలైన విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే ఫీజు చెల్లించిన వారికి మాత్రమే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. మనమిత్ర ద్వారా మొబైల్ నుంచి 95523 00009 నెంబరు ద్వారా కూడా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.



సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు

వైభవంగా వైశాఖ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో సోమవారం వైశాఖ పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. మలయప్పస్వామిని విశేషంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు ప్రియ వాహనుడు గరుడునిపై స్వామి కొలువుదీరి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు విశేషంఖ్యలో పాల్గొని మలయప్పస్వామిని దర్శించుకున్నారు. గ్యాలరీల్లోని భక్తుల గోవిందనామస్మరణలు, కర్పూర హారతుల వెలుగులతో మాడవీధులు శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,423

తలనీలాలు సమర్పించినవారు: 29,361





దీవించమ్మా.. గంగమ్మ

ఇద్దరు కైకాల కులస్థులు సున్నపు కుండల వేషధారణతో గంగమ్మను దర్శించుకున్నారు. మిగిలిన భక్తులు చిత్ర, విచిత్ర వేషాలను ధరించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వేప చీరలు ధరించి కొందరు.. పొర్లు దండాలతో మరికొందరు గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





ఆస్తులు పంచేశాను

పిల్లలు చూడడం లేదు ● సబ్‌కలెక్టర్‌కి విన్నవించుకున్న విశ్రాంత పోలీసు



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారుడు

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): 'నా భార్య చనిపోయింది. ఉన్న ఆస్తిని కుమారుడు, కుమార్తెకు పంచి పెట్టాను. వృద్ధాప్యంలో వాళ్లు నన్ను చూడటం లేదు' అని కోట మండలం విద్యానగర్‌కు చెందిన విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందించారు. తనకు జీవనం ఇబ్బందికరంగా మారిందని, సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరు



ఎస్వీ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం మొదలైన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 7,427 మందికిగాను 448 మంది.. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 848 మందికి గాను 78 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

డిపో నిర్వహణ ఇలాగేనా..!

సిబ్బంది కొరతైతే ఓడీల్లో ఎందుకున్నారు? ● ఆర్టీసీ అధికారుల తీరుపై జోనల్ చైర్మన్ అసహనం

సూళ్లూరుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): 'డిపో నిర్వహణ ఇలాగేనా? కార్యాలయ సిబ్బంది 11 గంటలైనా ఎందుకు రాలేదు? పరిసరాలు ఇలాగేనా ఉండేది? అధికారులు ఏం చేస్తున్నారు?' అంటూ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట డిపోను సోమవారం తనిఖీ చేసిన ఆయన.. 11 గంటలైనా సిబ్బంది రాకపోవడాన్ని గుర్తించారు. ఉదయం 5 గంటలకు విధుకు హాజరుకావాల్సిన సూపర్‌వైజర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు సర్వీసుల వివరాలను అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డిపో నిర్వహణతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గత వైసీపీ సర్కారు ఆర్టీసీ ఆస్తులను సైతం తాకట్టు పెట్టి సంస్థను నిర్వీర్యం చేసిందని, దానిని సరిదిద్ది పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ఎలాగని ప్రశ్నించారు. డిపోలో తగినంత మంది సిబ్బంది లేనప్పుడు కండక్టర్లు, డ్రైవర్లను ఓడీల్లో ఎందుకు ఉంచుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన విజిలెన్స్ విచారణ నివేదిక తెప్పించుకొని డిపో నిర్వహణను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, విజయమ్మ పాల్గొన్నారు.



డిపోను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

పిడుగుపాటుకు యువకుడి బలి



మృతిచెందిన ఇరుదైనాథన్ డేవిడ్

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): తడ సున్నపుగుంట ప్రాంతానికి చెందిన ఇరుదైనాథన్ డేవిడ్ అలియాస్ చెందు(22) పిడుగుపాటుకు బలయ్యాడు. సోమవారం మధ్యాహ్నం పల్లిపాళెం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో స్నేహితులు భాను, విజయ్, వంశీ, గుణ, మరి యదాసులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా పిడుగుపడింది. ఇరుదైనాథన్ డేవిడ్ స్పృహ తప్పిపడిపోవడంతో వెంటనే శ్రీసిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

మేము సైతం

● ఇండియన్ ఆర్మీకి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15లక్షలు



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భారత సైన్యానికి తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15 లక్షల చెక్కును విరాళంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం హోండా మోటార్స్ పృథ్వీ ఇతర ఆటోమొబైల్ డీలర్లతో కలిసి కలెక్టర్‌కు చెక్కు అందజేశారు.

ఈ-సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురండి



అధికారులకు సూచనలిస్తున్న హెల్త్ కమిషనర్ వీరపాండ్యన్

తిరుపతి(వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తిరుపతి రుయాస్పత్రిలో ఈ సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. రుయాస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, పెథాలజీ, ఎంఆర్ఐ, రేడియాలజీ విభాగాలను పరిశీలించారు. తక్షణమే వైద్య పరీక్ష ఫలితాలను అందించేందుకు ఈ-సీటీ డయాగ్నోసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. 24 గంటలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ సెంట్రల్ ల్యాబ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. మందులు, వైద్య పరికరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డీఎస్ఎన్ మూర్తి, వైద్యులు మాధవీలత, శ్రీధర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి ప్రమాదం

● ఆటోను ఢీకొన్న టిప్పర్

● 8 మంది తమిళనాడువాసులకు తీవ్ర గాయాలు



గాయపడిన రవిచంద్రన్ - కుమారవేల్

శ్రీకాళహస్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలం పదో మైలు వద్ద సోమవారం అర్ధరాత్రి ఆటోను టిప్పర్ ఢీకొనడంతో 8 మందికి తీవ్ర.. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం పెరంబూరుకు చెందిన 11 మంది శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి సోమవారం బస్సులో వరదయ్యపాళేనికి వచ్చారు. అక్కడ్నుంచి ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. పదో మైలు వద్ద వీరి ఆటోను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని తిరుపతి రుయాకు పంపించారు.

బి న్యూ మొబైల్ స్టోర్స్‌లో సమ్మర్ ఆఫర్లు



టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం



కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య) మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సోమవారం ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీజే రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవోను రద్దుచేసి కొత్త జీవో విడుదల చేసిన తర్వాత మాత్రమే పాఠశాలలను పునఃసమీక్షించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ఐదు తరగతులు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల్లో నియమించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్లతో కలిపి లెక్కించి ఆ మేరకు పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఇలా మొత్తం 13 డిమాండ్లను వివరిస్తూ తక్షణం వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులు కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారి మోహన్‌బాబు, నాయకులు సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులు బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, మస్తానయ్య, పద్మజ, హేమాంబరధరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలీసు 'పీజీఆర్ఎస్'కు 36 అర్జీలు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 36 అర్జీలు అందాయి. వీటిలో భూ తగాదాలపై 10, డబ్బు తగాదాలపై 8, వేధింపులపై 5, ఆస్తి తగాదాలపై 4, చీటింగ్‌పై 3, కుటుంబ తగాదాలపై 3, మిగిలిన సమస్యలపై మూడు అర్జీల చొప్పున ఉన్నాయి. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ అర్జీలను స్వీకరించారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డివిజనల్ స్థాయి అధికారులను ఆదేశించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టండి

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. దూరదృష్టితో పనిచేసినప్పుడే సమస్యనుంచి బయటపడే అవకాశం ఉంటుందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడుగంటిన భూగర్భ జలాల పెంపుకోసం గతంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలిచ్చాయని గుర్తుచేశారు. ఇటీవల జిల్లా పరిషత్ కమిటీ సమావేశంలో భూగర్భ జలాల పెంపు, నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించామని వివరించారు.

విజయం డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా


అటానమస్ హోదా ప్రతిని చూపుతున్న తేజోమూర్తి తదితరులు

చిత్తూరు సెంట్రల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు యూజీసీ ద్వారా స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా లభించినట్లు అధినేత తేజోమూర్తి తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు సాధారణ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 2003లో స్థాపించిన విజయం డిగ్రీ కళాశాల ఉన్నత ప్రమాణాలతో ప్రభుత్వ, ఎంఎన్‌సీ రంగాల్లో విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ ప్రమాణాల వల్లే 2022లో ప్రతిష్ఠాత్మకమైన న్యాక్ ఏ-ప్లస్ గ్రేడ్‌ను 3.35/4.0 సీజీపీఏ స్కోర్‌తో తొలి యత్నంలోనే తమ కళాశాల సాధించిందని చెప్పారు. 2024లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి 2(ఎఫ్) గుర్తింపు లభించిందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి స్వయం ప్రతిపత్తి హోదా రావడం గర్వంగా ఉందన్నారు. అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి హోదా మాత్రమే కాదని, ఒక బాధ్యతని గుర్తుచేశారు. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు మార్కండేయ నాయుడు, రమణప్రసాద్, దేవేంద్రన్, రాజగోపాల్ నాయుడు, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లె చెరువులో వృద్ధురాలి మృతదేహం



రామకుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని మిట్టపల్లె పెద్దచెరువులో సోమవారం ఉదయం గుర్తు తెలియని వృద్ధురాలి శవాన్ని స్థానికులు కనుగొన్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని శవాన్ని వెలికితీశారు. వృద్ధురాలి మొహం గుర్తు పట్టలేనివిధంగా తయారైంది. దీంతో పోలీసులు గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలు మెరూన్ కలర్ చీర, వంకాయ పువ్వు రంగు పావడ, మెడలో ఆకుపచ్చ, తెలుపు రంగు దండ ధరించి ఉంది. రెండు చేతుల మీద ముగ్గుల పచ్చబొట్లు ఉన్నాయి. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, స్థానిక ఎస్ఐ వెంకటమోహన్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 94409 00703, 94407 96737 నెంబర్లకు సమాచారమివ్వాలని వారు కోరారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ

యువకుడి మృతి, మరో ఇద్దరికి గాయాలు


మహేష్ మృతదేహం

గుడిపాల, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు చెందిన బాబు, పాలసముద్రం మండలం వర్ల పూడి గ్రామానికి చెందిన ఆర్ముగం ద్విక్రవాహంలో గుడిపాల నుంచి సోమవారం రాత్రి వేలూరు వైపు బయల్దేరారు. అదే సమయంలో గుడిపాల మండలంలోని వసంతాపురానికి చెందిన మహేష్ (38) మరో ద్విచక్ర వాహనం వస్తున్నాడు. చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిపై గుడిపాల క్రాస్ సమీపానికి వచ్చేసరికి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. వీరిలో మహేష్‌కు తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా 190 రామాపురం సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరినీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి


మృతి చెందిన శేఖర్

తిరుపతి(నేరవిభాగం), మే 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి చెందిన ఘటన తిరుపతిలో సోమవారం చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు... ఐరాల మండలం మద్దిపట్లపల్లెకు చెందిన శేఖర్(50) తిరుపతి వీఆర్ఎల్ పార్సిల్ సర్వీసులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పార్సిల్ అన్‌లోడు చేసి వాహనాన్ని ఎస్వీఎస్ కళాశాల వద్ద పార్కింగ్ చేయడానికి వెళ్లాడు. అక్కడ పైనున్న విద్యుత్ వైర్లు వాహనానికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ గిరిబాబు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడుకు తరలిపోతున్న కౌండిన్య నదీజలాలు

● ఆందోళనలో పరీవాహక ప్రాంతాల రైతులు

పలమనేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలో వర్షాకాలం ప్రవహించే కౌండిన్య నదీ జలాలు ఈ ఏడాదీ తమిళనాడుకు తరలిపోనున్నాయి. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా ఈ దుస్థితి నెలకొంది. నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల మీదుగా కౌండిన్య నది ప్రవహిస్తూ తమిళనాడుకు తరలిపోతుంది. ఈ నదీ జలాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వాలు చెక్‌డ్యాంల ద్వారా నిలువరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇలా చెక్ డ్యాంలలో కౌండిన్య నదీజలాలు నిల్వచేయడంతో వేలాది ఎకరాలకు నీరందేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి మద్దతుదారులు చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టడం జరుగుతోంది. నాసిరకంగా నిర్మించడంతో కొద్దిపాటి వర్షాలు కురిసినా కౌండిన్య నదిలో నీరు ప్రవహిస్తే చెక్‌డ్యాం కొట్టుకుపోతోంది. పలమనేరు పంప్ హౌస్ వద్ద ఉన్న రెండు చెక్‌డ్యాంలు సక్రమంగా ఉన్నా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమీపంలో ఇసుక తోడేశారు. పలమనేరు దాహార్తి తీరుస్తున్న చెక్‌డ్యాంలను నామరూపాలు లేకుండా చేశారు. కౌండిన్య నదిపై దెబ్బతిన్న చెక్‌డ్యాంల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని నదీపరీవాహక రైతులతోపాటు పలమనేరు పట్టణ ప్రజలు కోరుతున్నారు. పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద నిర్మించిన జలాశయం రెండేళ్ల క్రితమే ఒట్టిపోయింది. దీనికి అనుబంధంగా గంగన్న శిరస్సు జలపాతం వద్ద జలాశయం నిర్మించి అక్కడి నుంచి కాలువపల్లి జలాశయానికి నీటిని మళ్లించేందుకు ప్రతిపాదించిన ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. అధికారులు ఇకనైనా స్పందించి యుద్ధప్రాతిపదికన పలమనేరుకు పంప్‌హౌస్ సమీపంలోని కౌండిన్య నదిపై రెండు భారీ చెక్‌డ్యాంల నిర్మాణం చేపడితే ప్రజలకు తాగునీటి సమస్య ఉండదు. చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టకుంటే ఈసారీ తమిళనాడుకు నీరు చేరుతాయని రైతులు, పలమనేరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కౌండిన్య నది ఇలా..



పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫారం వద్ద దెబ్బతిన్న చెక్‌డ్యాం - కూర్మాయి సమీపంలో కౌండిన్య నదిపై దెబ్బతిన్న చెక్‌డ్యాం

ప్రజలకు హానికరంగా డైయింగ్ యూనిట్లు

పరిశ్రమలకు కేటాయించిన స్థలంలోకి మార్చండి ● కలెక్టర్‌కు నగరి మున్సిపల్ కౌన్సిలర్ల వినతి ● కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 234 అర్జీలు




బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, కలెక్టరేట్ వద్ద ఎస్ఆర్‌పురం మండలం ఎస్టీకాలనీవాసులు, కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నగరి మున్సిపల్ కౌన్సిలర్లు

చిత్తూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు హానికరంగా మారిన డైయింగ్ యూనిట్లను పరిశ్రమల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలానికి మార్చాలని నగరి మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. నగరిలో ఉన్న డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడే రసాయనాలతో వ్యాధులు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం.. 60వేల జనాభా కలిగిన నగరిలో గత ఐదేళ్లలో 16,349 మంది చర్మవ్యాధులు, 14,009 మంది టీబీతో, 29,519 మంది డయాబెటిస్‌తో, 7,251 మంది ఆస్తమాతో, ఈ ఏడాదిలో 59 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో.. వైస్ ఛైర్మన్ బాలన్, దళిత్‌ఫ్రంట్ నాయకుడు గజేంద్రన్, కౌన్సిలర్లు దయానిధి, బీ డీ భాస్కర్, ఇంద్రయ్య, గోపాల్‌రెడ్డి, బిలాల్, మోహన్‌లాల్, ప్రజాసంఘ నాయకులు మునికృష్ణారెడ్డి, ఆనందకుమార్, ఎల్లప్పరెడ్డి ఉన్నారు. కాగా, కలెక్టరేట్‌కు వచ్చిన బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఆర్డీవో శ్రీనివాసులు, పలువురు అధికారులు స్వీకరించారు.

పలమనేరు నియోజకవర్గం నుంచి తగ్గిన అర్జీలు: కలెక్టర్

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 234 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూకు 189, డీఆర్‌డీఏకు 21, పోలీసుశాఖకు 7, మిగిలిన శాఖలకు 17 అర్జీల చొప్పున ఉన్నాయి. గతంలో పలమనేరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో రెవెన్యూ సమస్యలు వచ్చేవని, అక్కడ మూడు వారాలపాటు పీజీఆర్ఎస్ నిర్వహించడం వల్ల భారీగా తగ్గాయని కలెక్టర్ తెలిపారు. అర్జీల్లో అక్కడికక్కడే పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ప్రధానంగా వచ్చిన అర్జీలిలా..

● సర్వే నెంబరు 170లో 18 ఎకరాల పశువుల మేత భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఎస్ఆర్‌పురం మండలం ఏఎంపురం పంచాయతీలోని ఎస్టీకాలనీకి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి మేత భూమిని కాపాడాలని కోరారు.

● తమ గ్రామంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాల ఉండేదని పుంగనూరు మండలం ఈడిగపల్లె పంచాయతీలోని మరసనపల్లె గ్రామస్తులు తెలిపారు. ఇపుడు మూడు నుంచి ఐదో తరగతి వరకు ఉన్న విద్యార్థులను ఈడిగపల్లెకు మార్చారన్నారు. దీనివల్ల పిల్లలు కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడతారన్నారు. గతంలో ఉన్న విధంగా పాఠశాలను నడపాలని కోరారు.

● చర్చి, ఆలయం పక్కనే మద్యంషాపు ఉండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామస్తులు వాపోయారు. పైగా గ్రామ సచివాలయం కూడా పక్కనే ఉందన్నారు. దీని వల్ల ముఖ్యంగా మహిళలు ఈ మార్గంలో రావాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. ఈ షాపును వేరేచోటుకు మార్చాలని విన్నవించారు.

● సర్వే నెంబరు 343-2డిలోని ఎకరం ప్రభుత్వ భూమిలో 30 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని యాదమరి మండలం దాసరాపల్లె ఆది ఆంధ్రవాడకు చెందిన దళితులు తెలిపారు. ప్రస్తుతం కొందరు తమ ఇళ్లను కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇళ్లు తప్ప తమకు వేరే ఆధారం లేదని, అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

కుప్పం మండలంలో పంటలపై జంట ఏనుగుల దాడులు



ఎన్.కొత్తపల్లెలో ధ్వంసమైన టమోటా తోట (ఇన్‌సెట్లో)నేలరాలిన టమోటాలు

కుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని పలు గ్రామాల్లోని పంటలపై జంట ఏనుగులు ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం దాడులు చేశాయి. ఆదివారం రాత్రి మండలంలోని సజ్జలపల్లి పంట పొలాలపై పడిన ఏనుగులు అక్కడినుంచి ఎన్.కొత్తపల్లి, పెద్ద బంగారునత్తం మీదుగా పొలాలను తొక్కి తిని ధ్వంసం చేస్తూ నడిమూరు వైపుగా వచ్చాయి. ఏనుగుల దాడుల్లో వరి, రాగి, టమోటా పంటలు ధ్వంసమయ్యాయి. రాత్రినుంచి అటవీ శాఖ అధికారులు సిబ్బందితో కలిసి జంట ఏనుగులను మండలం నుంచి తరిమేందుకు ప్రయత్నాలు చేశారు. చివరకు సోమవారం ఉదయం నడిమూరు అటవీ ప్రాంతంలో ఉన్న ఏనుగులను తమిళనాడు అడవుల్లోకి తరిమేశారు. దీనిపై డీఆర్వో సమీర్ బాషాను వివరణ కోరగా, ఏనుగులు దాడులు చేసిన మాట వాస్తవమేనన్నారు. అయితే వాటిని తమిళనాడు అడవుల్లోకి డ్రైవ్ చేశామని చెప్పారు. ఎటువంటి ప్రాణ నష్టమూ జరగలేదన్నారు. పంట ధ్వంసమై ఉంటే రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్


డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో టీచర్లు సోమవారం డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, మణిగండన్ మాట్లాడుతూ.. పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతులకు సంబంధించి సమస్యల పరిష్కారంపై పాఠశాల విద్యాశాఖ వైఖరిపై నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో ప్రతివారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 15వ తేదీన వేలాది మంది టీచర్లతో విద్యాభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహనాబేగం, రెడ్డెప్పనాయుడు, ప్రసన్నకుమార్, దీనావతి, బాషా, మునిరత్నం, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

వజ్రకిరీటధారణలో గంగమ్మ

నేటి తిరుపతి జాతరకు సర్వం సిద్ధం


గంగమ్మ ఆలయానికి తరలివచ్చిన భక్తులు



తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి):తిరుపతి నగరమంతా జాతర సందడి నెలకొంది. అమ్మలగన్న అమ్మ గంగమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లుతోంది. సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తరుగా రద్దీ ఉన్నప్పటికీ రాత్రి నుంచే గంగమ్మ ఆలయానికి భక్తులు బారులు తీరారు. చిత్ర, విచిత్ర వేషాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పల్లివీధిలోని వేశాలమ్మకు మంత్రి కొల్లు రవీంద్ర సారె అందజేశారు. తిరుపతి గంగజాతరకు చాటింపు అనంతరం వివిధ వేషాలలో మునిగితేలిన గంగమ్మకు సోమవారం అర్ధరాత్రి తర్వాత విశిష్ట అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సర్వాలంకారశోభితమైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు. అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి గంగజాతర ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోనే పరిమితం కాకుండా స్థానికంగా ఉన్న టీపీ ఏరియాలో తాళ్లపాక పెదగంగమ్మ, చింతల చేనులో ముత్యాలమ్మ, కుమ్మరితోపులో నేరేళ్లమ్మ, దాసరిమఠంలో మాతమ్మ, పల్లెవీధిలో వేశాలమ్మ, చింతకాయవీధిలో కరిమాను గంగమ్మతో పాటు చిన్న గంగమ్మ ఆలయంలోనూ జాతర సంబరాలు కనిపించాయి.

పూజలందుకున్న సున్నపు కుండలు



సోమవారం సాయంత్రం వేశాలమ్మ ఆలయంలో కైకాల వంశస్థులు ఇద్దరు సున్నపు కుండలను ధరించారు. అక్కడ నుంచి నగరంలోని ప్రధాన వీధుల లోని ఇళ్లకు వెళ్లి హారతులందుకున్నారు. సున్నపుకుండల వేషధారులను భక్తులు కుర్చీలో కూర్చోబెట్టి పాదపూజ చేసిమొక్కులు తీర్చుకున్నారు. బుధవారం వేకువజాము వరకు వీళ్లు ఊరంతా తిరిగి పూజలందుకోనున్నారు.

నేడు పేరంటాల వేషం

పేరంటాల వేషాన్నీ కైకాలవాళ్లే ధరిస్తారు. ఎర్రగళ్ల చీర, ఎర్రని గుడ్డలో ఒడిబాలను కట్టుకుంటారు. అందులో అక్షింతలు, చవ్వాకు, దువ్వెన, అద్దం, నల్లగాజులు, పసుపు, కుంకుమ ఉంచుతారు. తలకు నల్లని గుడ్డను కట్టి కొప్పులా ముడివేసుకుంటారు. తలపై బంగారంలా కనిపించే అట్లతో చేసిన జడబిళ్లలు, పట్టీలు వంటి ఆభరణాలు కట్టుకుంటారు. పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుండి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. బుధవారం వేకువజామును చిన గంగమ్మ చెంప నరికిన తర్వాత పెద గంగమ్మ చెంపను నరకడంతో జాతర ముగుస్తుంది.

బోయకొండలో శాస్త్రోక్తంగా చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చౌడేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తి పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మ వారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. సోమవారం పౌర్ణమి సందర్భంగా ఆశీర్వాద మండపం వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కలశ స్థాపన చేశారు. అమ్మవారి మూల మంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు. అధిక సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏకాంబరం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రథమ శయనోత్సవం



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 11వ రోజు ఆది దంపతులకు శాస్త్రోక్తంగా ప్రథమ శయనోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పట్టు పాన్పుపై అధిష్ఠింపజేసి, శాస్త్రోక్తంగా ప్రథమ శయనోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా అమినిగుంటకు చెందిన జమిందారీ వంశస్థులు రాజేంద్రరాయల్ కుటుంబీకులు వ్యవహరించారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): కుట్టు మిషన్లపై ప్రభుత్వం ఇస్తున్న ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్లానూరులో కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడున్న మహిళలను పలకరించి శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత పొందడానికి ప్రభుత్వం కుట్టు మిషన్లపై శిక్షణ ఇస్తోందన్నారు. 90 రోజులపాటు ఈ శిక్షణను పొందిన తర్వాత కుట్టు మిషన్లను ఉచితంగా వారికే అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కుల కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, స్థానిక నాయకులు రమేష్, దామోదర్, విభూషణ్, అన్నాదురై, వెంకటప్ప, చిన్నదొరై, రాజ్ కుమార్, వెంకటాచలపతి, సుధాకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వాసుకు చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఆవుకుప్పానికి చెందిన వాసు నాలుగు నెలల క్రితం గ్రామ సమీపంలోని పిల్లిగుట్టల వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని బెంగళూరుకు తరలించి అక్కడ వైద్య చికిత్సలందజేశారు. కోలుకున్న అతడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వానికి విన్నవించాడు. ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా అతడికి రూ.1,04,340 ఆర్థికసాయం మంజూరు చేసింది. సోమవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డిలు చెక్కును వాసుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, వెంకట్రామగౌడు, గంట్లప్పగౌడు, వెంకటాచలం, నరసింహులు, కామరాజనాయక్, మనోహర్, సత్తి, గజేంద్ర, జయరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర ఆలయ కుంభాభిషేకం



రథాన్ని లాగుతున్న భక్తులు -
(ఇన్‌సెట్‌లో) ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరస్వామి

కుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో వెలసిన రామలింగేశ్వర సామి ఆలయ కుంభాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివారి రథోత్సవం హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నరేశ్ ఆధ్వర్యంలో పురవీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అనే నినాదాలతో ఈ ఉత్సవం ఆద్యంతం భక్తిప్రపత్తులతో సాగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కందూరు అధ్యక్షుడిగా శ్రీనివాసులు



టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు

సోమల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. సోమవారం కందూరు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రామ కమిటీ కార్యదర్శిగా ఎ.సుబ్రమణ్యంను, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, శంకర్, నౌషాద్, బాలకృష్ణ, దామోదరం నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు.

ఘనంగా కల్యాణ వెంకన్న రథోత్సవం



పట్నపల్లెలో జరిగిన కల్యాణ వెంకన్న రథోత్సవం

బైరెడ్డిపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి వారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణగావించి వివిధరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం రథాంగహోమం నిర్వహించి, ప్రత్యేకపూజలు జరిపారు. మేళతాళాలు, గోవింద నామస్మరణల మధ్య భక్తులు రథాన్ని లాగారు. పలువురు భక్తులు రథోత్సవానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంవద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయధర్మకర్త నారాయణమొదలి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరలో వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రారంభం

చౌడేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి రాంప్రసాద్‌రెడ్డిచే త్వరలో వ్యవసాయ పాలిటెక్నిక్‌ను ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కాటిపేరి పంచాయతీలో గత ప్రభుత్వంలో మంజూరై, నిర్మాణంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ పనులను పరిశీలించారు. పనులు పూర్తికావటంతో పాలిటెక్నిక్‌ను త్వరలో మంత్రి, జిల్లా కలెక్టరు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోండి

సోమల, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కోసం మండలంలోని ప్రతి రైతు రూ.20వేలు పొందడానికి తప్పనిసరిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రం అధికారి లాగిన్‌లో భూముల వివరాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెలారులోపు అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు చేసుకున్న రైతుల ఖాతాల్లోకి నెలలోపే ఈ పథకం నగదును జమ చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రంలోని అధికారులను సంప్రదించాలన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



సిబ్బందికి సూచనలిస్తున్న వెంకటప్రసాద్

రామకుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా క్షయ, కుష్టువ్యాధి నివారణాధికారి వెంకటప్రసాద్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో శుభ్రతను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. వైద్యాధికారి లోకేశ్, సీహెచ్‌వో మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు



సోమలలో విరాళాలు అందజేస్తున్న దాతలు

సోమల, మే 12 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని తిరుపతి, కలికిరి క్రాస్ శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళం అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన కమిటీ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు ఎస్.మునివెంకటప్ప రూ.50,116, కమిటీ కోశాధికారి కర్రి జ్యోతీశ్వరుడు రూ.50,116, గరడప్పగారి శ్రీరాములు రూ.10,116, సీజీ రెడ్డెప్ప రూ.11,111 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఐడీసీ డైరెక్టర్ వై.సాంబయ్య, కె.నగేశ్, హరినారాయణ, రఘు, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం




ప్రత్యేక అలంకరణలో సీతారాములు

పుంగనూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెలో వెలసిన సీతారాముల ఆలయంలో స్వామి వార్లకు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయాన్నే ఆలయంలో గణపతి పూజ, హోమాలు నిర్వహించి, సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ అర్చకులు సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు తూర్పు మొగసాల వద్ద రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం జరిగింది. స్థానిక తూర్పుమొగసాలకు చెందిన అల్లాబక్ష్ కుమారుడు అయూబ్(35) రోడ్డుపై నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అయూబ్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

కనకదుర్గాదేవికి విశేష పూజలు



విశేష అలంకరణలో కనకదుర్గాదేవి

పలమనేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పాతపేట కనకదుర్గానగర్‌లో వెలసిన కనకదుర్గాదేవి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. అనంతరం ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిరుపయోగంగా గ్రామచావిడి

● రూ.3కోట్లకు పైగా విలువైన స్థలాన్ని దొడ్డిదారిలో లీజుకు తీసుకునేందుకు ప్రయత్నాలు



పలమనేరులో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రామచావిడి

పలమనేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రామచావిడి దశాబ్దకాలంగా మూతపడి వృథాగా ఉంది. బ్రిటీషు హయాంలో పరిపాలనా సౌలభ్యం కోసం గ్రామచావిడి కోసం ఒక భవనాన్ని నిర్మించారు. ఈ భవనం జాతీయ రహదారి పక్కనే వుంది. మారుతున్న కాలానుగుణంగా ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకొంది. జాతీయ రహదారికి ఆనుకొనే ఉన్న ఈ గ్రామచావిడి స్థలానికి మార్కెట్‌లో చదరపు అడుగు రూ.15వేలు ధర పలుకుతోంది. ఈ గ్రామచావిడి స్థలం దాదాపు 2000 చదరపు అడుగుల మేర ఉంది. అంటే దీని ధర మార్కెట్‌లో రూ.3కోట్లు పైమాటే. ఆరునెలల క్రితం ఒకసారి ఇప్పటి తహసీల్దార్ ఇన్బనాథన్ ఈ గ్రామచావిడిని పరిశీలించారు. భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని కూడా అప్పట్లో చెప్పారు. ఎట్టకేలకు గ్రామచావిడి స్థలం మళ్లీ రెవెన్యూ కళ సంతరించుకొంటుందని స్థానికులు ఆశించారు. అయితే స్థానికుల ఆశలను కొందరు నీరుగార్చే ప్రయత్నాలు ప్రారంభించినట్లు ప్రచారం సాగుతోంది. వృథాగా ఉన్న కోట్ల విలువ చేసే గ్రామచావిడి స్థలాన్ని ఎలాగైనా తమకున్న రాజకీయ పరపతితో నామమాత్రపు లీజుకు దక్కించుకొని వాణిజ్య సముదాయం నిర్మించుకొంటే లక్షలాది రూపాయల నెలసరి అద్దె పొందవచ్చని కొందరు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు స్పందించి ఎంతో చరిత్ర కలిగిన గ్రామచావిడి స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

విరూపాక్షమ్మకు వైభవంగా కలశాభిషేకం



ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న విరూపాక్షమ్మ - వివిధ రకాల వేషధారణలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు - 108 బిందెల పసుపునీళ్లతో ఆలయానికి వస్తున్న మహిళలు

కల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో భక్తుల పాలిట కొంగు బంగారంగా కొలువైన విరూపాక్షమ్మ ఆలయంలో జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి 108 బిందెల పసుపునీళ్లతో కలశాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ముందుగా గణపతి హోమం, దుర్గాహోమం, నవగ్రహహోమం నిర్వహించారు. అనంతరం బీసీ కాలనీ నుంచి 108 బిందెల పసుపునీళ్లతో మహిళలు పురవీధుల గుండా అమ్మవారి నామస్మరణలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారి మూల విగ్రహంపై పసుపునీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నవధాన్య మొలకలపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన అనంతరం అమ్మవారు గాయత్రీ అలంకారంలో భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. వివిధరకాల వేషధారణలతో ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రెండవ రోజు వేడుకల ఉభయదారులుగా కట్టకిందపల్లికి చెందిన గురుమూర్తి నాయుడు, కరుణాకర్ నాయుడు, కల్లూరుకి చెందిన జగదీష్ పిళ్లై, మదన్‌మోహన్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా పౌర్ణమి పూజలు



అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

రామకుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం రాత్రి పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. రాత్రికి ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, హరికుమార్ స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. రామకుప్పం పట్టణ శివార్లలోని పిల్లిగుట్టల వద్ద గల ఆంజనేయస్వామి ఆలయంలో కూడా నిర్వాహకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి, విశేష అలంకరణలు చేశారు.

శేషాద్రిస్వామి ఆలయంలో...

బైరెడ్డిపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలో వెలసిన శేషాద్రి స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయఅర్చకులు తిప్పయ్యాచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత శేషాద్రి స్వామి మూలవిరాట్‌కు అభిషేకంచేసి విశేషపూజలు జరిపారు. శ్రీవారి సేవకుడు ధనంజయగౌడు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం ఆలయంవద్ద కళాబృందాలచే కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక భక్తి గీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. అలాగే మండలంలోని కుప్పనపల్లె సమీపంలో వున్న కాలభైరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మురళీధరాచార్యులు ప్రత్యేకపూజలు జరిపి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పరుష వెంకటేశ్వరస్వామి ఆలయంలో...



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సోమల, మే 12 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని పరుష వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మొలకల పౌర్ణమి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేసి అభిషేకపూజలు జరిపారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి అర్చకులు మోహన్‌బాబు, వేణుగోపాల్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిపారు. భక్తులకు అన్నదాన తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు జి.మల్లికార్జున, వైఎస్.మునిరత్నం, చంద్రశేఖర్, శ్యాంసుందర్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాజనాలబండలో ...



ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం పౌర్ణమి సందర్భంగా కొండపై వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి, బండపై వెలసిన ఆంజనేయ స్వాములకు ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కర్ణంవారిపల్లె, 29ఏ చింతమాకులపల్లెలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం

సదుం, మే 12 (ఆంధ్రజ్యోతి): బూరగమందలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఐదవ రోజైన సోమవారం రాత్రి శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం తిరుచ్చి ఉత్సవం, స్నపన తిరుమంజనం, రాత్రి 9 గంటలకు గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

శనీశ్వరస్వామి ఆలయ కోనేరు పూడికతీత పనులు ప్రారంభం



కోనేరు పూడికతీత పనులను ప్రారంభిస్తున్న కిశోర్‌గౌడు

బైరెడ్డిపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగినేపల్లె సమీపంలోవున్న శనీశ్వరస్వామి ఆలయ కోనేరులో పూడికతీత పనులకు సోమవారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎన్నోయేళ్లుగా శిథిలావస్థలో వున్న కోనేరును పునరుద్ధరించడానికిగాను ఉపాధి పథకం కింద పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కోనేరును పునరుద్ధరించడానికి పనులు ప్రారంభం కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ద్రావిడ వర్సిటీ డిగ్రీ, పీజీ ఫలితాలు విడుదల

గుడుపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ ఫలితాలను సోమవారం పరిపాలన భవనంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను విద్యార్థులకు సులభతరం చేసేందుకు మొదటిసారిగా ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు వీసీ తెలిపారు. విద్యార్థులు ద్రావిడ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో తమ పరీక్ష ఫలితాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదుం తహసీల్దార్‌గా జయప్రకాష్ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): సదుం తహసీల్దార్‌గా కుప్పం డివిజనల్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న జయప్రకాష్‌ను నియమిస్తూ సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తుండిన హుస్సేన్.. ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఖాళీగా ఉన్న ఆ పోస్టుకు జయప్రకాష్‌ను నియమించారు.

శేషవాహనంపై ఆదిదంపతుల విహారం



పెనుమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పులిగుండు శివాలయంలోని పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సాయంత్రం ఆదిదంపతులను శేషవాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్. అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణగా ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనగర్ కాలనీ సమస్యలు పట్టించుకోండి



లక్ష్మీనగర్ కాలనీలో మురుగు కాలువలు లేక ఇంటి వద్దే గుంతలో నిల్వ ఉన్న మురుగునీరు - గుంటలతో మట్టిరోడ్డు

పలమనేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని లక్ష్మీనగర్ కాలనీలో సమస్యలను అధికారులు పట్టించుకొని పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సుమారు 150కిపైగా గృహాలు ఉన్న లక్ష్మీనగర్ కాలనీలో మున్సిపాలిటీకి ప్రతి ఏటా పన్నుల రూపంలో లక్షలాది రూపాయలు చెల్లిస్తున్నప్పటికీ కాలనీలో ఏమాత్రం మౌలిక వసతులు లేవని కాలనీ వాసులు అంటున్నారు. ముఖ్యంగా మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లవద్దే గుంతలు తవ్వి మురుగునీటిని నిల్వ చేసుకోవలసిన దుస్థితి నెలకొందని అన్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా మురుగునీటి గుంతల నుంచి మురుగునీరు పొంగి వీధుల్లోకి ప్రవహిస్తోందని, వర్షాకాలంలో ఈ కాలనీ మురుగునీటి గుంటను తలపిస్తుందని వారు తెలిపారు. ఈ కాలనీలో ఒక్కవీధికి కూడా సీసీ రోడ్లు లేకపోవడంతో వాహనదారులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. చీకటి పడగానే వీధుల్లో పాములు కూడా దర్శనమిస్తుంటాయని, ఇళ్లనుంచి చిన్న పిల్లలు, మహిళలు వెలుపలికి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ కాలనీలో సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని, వీధిదీపాలు అవసరమున్న చోట ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



ఐరాల(కాణిపాకం), మే 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి గుడిలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని సోమవారం ఉదయం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని ఉంచి భక్తుల ఆధ్వర్యంలో వ్రతాన్ని అర్చకులు నిర్వహింపజేశారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, వరసిద్ధుడిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేవీ అరవింద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వేణు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించగా, సాయంత్రం ప్రాకారోత్సవం జరిగింది. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గుడిపాల: 197రామాపురంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో సోమవారం చిత్రా పౌర్ణమి వేడుకలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గోవిందమాంబ సమేత వీరభద్ర స్వామికి మహారాజరాణి అలంకరణ చేసి.. పుష్పపల్లకిపై గ్రామంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నింద్ర: మండలంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పాల బిందెలతో మహిళలు ఊరేగింపు వెళ్లి చెల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యంలో ఉన్న బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. కన్నడ సినీనటుడు రామ్‌చరణ్‌రాజు తన కుటుంబీకులతో కలిసి పూజలు చేశారు. మండల వాసులతో పాటు బెంగళూరు, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



చెస్ పోటీల్లో నవ్యశ్రీ ప్రతిభ

నగరి, మే 12 (ఆంధ్రజ్యోతి): పొన్నేరిలో ఉన్న వేలమ్మాళ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరుగుతున్న రేటింగ్ చెస్ టోర్నమెంటు అండర్-15 కేటగిరీలో నగరి మండలంలోని ముడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ ప్రతిభ చూపారు. ఐదో స్థానంలో నిలవడంతో కోచ్ ఆనంద్ మోహన్, హెచ్ఎం మురళీకృష్ణ అభినందించారు.

ఇంటి పట్టాలివ్వండి: సీపీఐ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

నగరి, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని నెత్తంకండ్రిగలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నవారికి ఇంటి పట్టాలు ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోదండయ్య, వేలన్, శేఖర్, మురళి, రాజేంద్ర, చినరాస్, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై ఆదిదంపతుల విహారం



పెనుమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పులిగుండు శివాలయంలోని పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సాయంత్రం ఆది దంపతులను శేష వాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, తాణావేణుగోపాలపురం, సీఎస్. అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణగా ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు ప్రేమతో వైద్యం అందించండి



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

బంగారుపాళ్యం, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు ప్రేమతో వైద్యం అందించాలని సిబ్బంది, అధికారులకు అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఎయిడ్స్, టీబీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి గర్భిణికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలని చెప్పారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ జన్మదినాన్ని టీడీపీ నేతలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటుఅధ్యక్షుడు సీఆర్ రాజన్, కోదండయాదవ్, నేతలు సురేంద్రకుమార్, కాజూరు బాలాజీ, వెంకటేష్‌యాదవ్, అశోక్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

రోగుల వివరాలను ఈహెచ్‌ఆర్‌లో నమోదు చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న హనుమంతరావు

గంగాధరనెల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలను ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు (ఈహెచ్‌ఆర్)లో నూరుశాతం నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీని సోమవారం తనిఖీచేసి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ షానవాజ్, స్టాఫ్‌నర్స్ నిమ్మి తదితరులు పాల్గొన్నారు.

బతికున్నా చంపేశారు..!

● జేసీకి వేపమానువీధివాసి ఫిర్యాదు



వివరాలు తెలియజేస్తున్న రఘునాథరెడ్డి

చిత్తూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): తాను, తన కుటుంబీకులు బతికున్నా చంపేశారని 36వ డివిజన్‌లోని వేపమానువీధికి చెందిన రఘునాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ విద్యాధరికి ఫిర్యాదు చేశారు. తనతోపాటు భార్య కుమారి, కూతురు మధుశ్రీ చనిపోయినట్లు ఆధార్‌కార్డుతోపాటు అన్ని ఆన్‌లైన్ డేటాల్లోనూ ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోలేక పోతున్నానని చెప్పాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన తమకు పథకాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నాడు.





రాగిమానుపెంట దళితవాడ సమీపంలో, బంగారుపాళ్యం సచివాలయం-2 వద్ద చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న రోడ్లు

ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయమే..!

వాహన చోదకుల ఆవేదన

బంగారుపాళ్యం, మే 12 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం నుంచి రాగిమానుపెంటకు వెళ్లే రోడ్డులో ప్రయాణం నరకప్రాయమని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిగుండా గోవర్ధనగిరి, వెలుతురుచేను,బీఎల్ కండ్రిగ, కంతలచెరువు, కీరమంద, కొదలమడుగు, బండ్లదొడ్డి, వేపనపల్లె, కేఎంకండ్రిగ, చంద్రశేఖర్‌పురం గ్రామాలకు చెందిన విద్యార్థులు, వ్యాపారులు,రైతులు.. మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలమయమైన రోడ్డును గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం అవి పెద్దవై.. చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. ఈ గుంతల్లో పడి వాహనచోదకులు గాయపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సుమారు పది కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలుపడి.. రాళ్లు తేలింది. మరోవైపు రోడ్డుకిరువైపులా మట్టి లేకపోవడం, సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడం కష్టంగా మారింది. ఇకనైనా ఈరోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నడివీధి గంగజాతరకు పటిష్ఠ బందోబస్తు

500 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నడివీధి గంగజాతరకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ మణికంఠ చెప్పారు. విధులు కేటాయించిన సిబ్బందికి సోమవారం సాయుధ దళ పరేడ్ మైదానంలో దిశానిర్దేశం చేశారు. 500 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని, 24 గంటలూ జాతర జరిగే ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించడం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆకతాయిలు, పిక్‌పాకెటింగ్ చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా నగర ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. అంతకు ముందు బజారువీధితోపాటు చర్చివీధి, శివాలయం వీధి, డీజే నిర్వహించే మ్యాక్స్ షోరూమ్, అమ్మవారిని నిమజ్జనం చేసే ప్రాంతాలను ఆలయ ధర్మకర్త సీకేబాబు సతీమణి లావణ్యతో కలిసి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, నగరి డీఎస్పీ అజీజ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, సీఐలు నెట్టికంఠయ్య, మహేశ్వర్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు: ఈఈ

చిత్తూరు రూరల్: గంగజాతర జరిగే ప్రదేశాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈలను ఈఈ మునిచంద్ర ఆదేశించారు. ఇందుకోసం లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు మొత్తం 30 మందిని జాతర జరిగే ప్రాంతాల్లో డ్యూటీలు వేసినట్లు తెలిపారు. భక్తులు కూడా విద్యుత్ స్తంభాలను, తీగలను ముట్టుకోకూడదని సూచించారు.





సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ - బజారువీధిలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చెర్లోపల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థులు

చిత్తూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లెలో సోమవారం ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీకి చెందిన బీఎస్సీ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రొఫెసర్, ఎన్‌ఎస్‌ఎస్ హెడ్ శైలజ మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీవరకు చెర్లోపల్లె, చుట్టు పక్కల గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. దీనివల్ల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు ఏరువాక కోఆర్డినేటర్ సంధ్యారాణి, ఎన్‌ఎస్‌ఎస్ పీఆర్ ప్రశాంతి, టీడీపీ నాయకుడు కాండ్రా రమేష్ నాయుడు, స్థానిక సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

20న పంచాయతీ కార్మికుల సమ్మె

బంగారుపాళ్యం, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన జరిగే పంచాయతీ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ సంస్థ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.మధు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్‌కు సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుతో సమ్మె చేయనున్నట్లు చెప్పారు. రూ.21వేల జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. కార్మికులు పొన్నుమని, లక్ష్మమ్మ, బాలాజి, మొగిలమ్మ, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కమిషనర్ నరసింహప్రసాద్ అర్జీలను స్వీకరించారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. విభాగాల వారీగా వచ్చిన అర్జీల్లో ఇంజనీరింగ్‌కు మూడు, టౌన్‌ప్లానింగ్‌కు ఒకటి, రెవెన్యూకు రెండు చొప్పున ఉన్నాయి. ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బంగారుపాళ్యం, మే 12 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులను అందజేయాలని చెప్పారు. కాగా, సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన బాధితుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను పంచాయతీ వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డీటీ కళ్యాణి, సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈఆర్వో కార్యాలయాల మార్పు



ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ పరిధిలో డివిజన్ల పునర్విభజన జరగడంతో ఈఆర్వో కార్యాలయాల(ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్)ను కూడా మార్చినట్లు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు గాంధీరోడ్డులోని ఈఆర్వో కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు. అలాగే గిరింపేటలోని ఈఆర్వో కార్యాలయంలో జీడీనెల్లూరు, పెనుమూరు, ఆవులకొండ, పాలసముద్రం మండలాల వినియోగదారులు బిల్లులు కట్టాలన్నారు. ఈ మార్పును వినియోగదారులు గమనించాలన్నారు. ఇకపై విద్యుత్ బిల్లులు, అవసపు లోడు క్రమబద్ధీకరణ, ఇతర సేవలు ఆయా మండలాలకు కేటాయించిన ఈఆర్వో కార్యాలయంలోనే పొందాలని సూచించారు.

ముత్తిగంగమ్మ జాతర ప్రారంభం



ఊంజల్ సేవను తిలకిస్తున్న భక్తులు

పెనుమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉగ్రాణంపల్లెలో ముత్తిగంగమ్మ జాతర సోమవారం ప్రారంభమైంది. మధ్యాహ్నం అమ్మవారి ఊంజల్ సేవలో భక్తులు పాల్గొన్నారు. కోలాటాలు, చెక్క భజనలు అలరించాయి. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి, గ్రామపెద్దలు గుణశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, కనకరాజారెడ్డి, ధనంజయరెడ్డి, ప్రవీణ్‌కుమార్, హరినాథ్, పరందామ పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయంలో వీఐపీ దర్శన టికెట్ల ప్రతిపాదన లేదు: ఈవో

ఐరాల(కాణిపాకం), మే 12 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రస్తుతం ఉచితం, రూ.150, రూ.100 దర్శనం టికెట్లు మాత్రం ఉన్నాయని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. వీఐపీ టికెట్ల వంటి ప్రతిపాదన చేయలేదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఆర్జిత సేవా టికెట్ల ధరలను పెంచడం లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆదేశాల మేరకు వేసవి కాలంలో ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుండటంతో ఎండవేడిమి నుంచి ఉపశమనం కోసం షెడ్లు నిర్మించడం, కాళ్లు కాలకుండా మ్యాట్లు, తెల్ల పెయింట్ వేయిస్తున్నామన్నారు. ఆలయంలో సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇస్తామని తెలియజేశారు.

15న హుండీ లెక్కింపు: వరసిద్ధుడి ఆలయ హుండీని ఈనెల 15వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు. ఆస్థాన మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఆరోజున సిబ్బంది ఎవ్వరూ సెలవు పెట్టకూడదని ఆదేశించారు.





మహారాజపురంలో ఎంపికైన వారికి డిక్లరేషన్ ఇస్తున్న ధనుంజయ నాయుడు - మేళంబాకంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక

విజయపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. విజయపురం, విజయపురం హరిజనవాడ, మంగళం, పోతురాజులుకండ్రిగ, ఎం.అగరంలో పార్టీ పరిశీలకుడు మణిరాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అలాగే కేవీపురం, కాళికాపురం, జీఎంపురం, బూచివానత్తంలో పార్టీ పరిశీలకుడు ధనుంజయనాయుడు.. నారపరాజుకండ్రిగ, మల్లారెడ్డికండ్రిగ, శ్రీహరిపురం, మహారాజపురం, జంబాడలో పార్టీ పరిశీలకుడు జానా వెంకటయ్య.. పన్నూరు, పన్నూరు-2లో పార్టీ పరిశీలకుడు మీరా హాజరై పార్టీ పంచాయతీ అధ్యక్షులు, గ్రామకమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళ అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు: టీడీపీ

నింద్ర, మే 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని టీడీపీ మండల ఎన్నికల పరిశీలకుడు చుక్కా ధనంజయులు యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని మేళంబాకం, ఎలకాటూరు, చవరంబాకం, ఇరుగువాయి పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు ఓం ప్రకాష్, నాగభూషనం, స్వయిరాజ్, లోకనాథంనాయుడు, దేవ, మోహనరావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు 'ఆయిల్ పామ్'పై రైతులకు శిక్షణ

విజయపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం రైతు సేవా కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శిక్షణ సమావేశం నిర్వహిస్తున్నట్టు గంగాధర నెల్లూరు ఉద్యాన శాఖాధికారి లోకేష్ తెలిపారు. ఉద్యాన పంటలు సాగుచేసేవారు హాజరు కావాలని కోరారు.

అన్నదానం

విజయపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): విజయపురం హనుమాన్ స్వామి ఆలయంలో సోమవారం చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని ధర్మకర్త మునిరెడ్డి.. భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం, మధ్యాహ్నం పూజలు చేసి.. రాత్రి పురవీధుల్లో స్వామిని ఊరేగించారు.

గుడిపాలలో నేడు కలెక్టర్ పర్యటన

గుడిపాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారక్కచెరువు, పాపసముద్రంలోని రామిరెడ్డిచెరువులను మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిశీలించనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో శిరీష ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

యాదమరి, మే 12 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించారు. స్టాఫ్ నర్సు ప్రభావతిని సన్మానించారు. హెల్త్ సూపర్‌వైజర్ సెల్వరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

గంగాధరనెల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవోగా ఎస్.సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగరి ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నతిపై ఇక్కడికొచ్చారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న హరిప్రసాద్‌రెడ్డికి రెగ్యులర్ ఎంపీడీవోగా పదోన్నతి పొంది విజయపురం మండలానికి బదిలీపై వెళ్లారు.

సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ

పెనుమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంపై శాతంబాకం రైతు సేవాకేంద్రంలో రైతులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, వీహెచ్ఏ సంధ్య పాల్గొన్నారు.

సదుం తహసీల్దార్‌గా జయప్రకాష్ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): సదుం తహసీల్దార్‌గా కుప్పం డివిజనల్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న జయప్రకాష్‌ను నియమిస్తూ సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తుండిన హస్సేన్.. ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఖాళీగా ఉండటంతో జయప్రకాష్‌ను నియమించారు.

అలరించిన దుర్యోధన వధ

నింద్ర, మే 12 (ఆంధ్రజ్యోతి): అత్తూరులో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. తిలకించడానికి తమిళనాడు సరిహద్దు ప్రాంతాలనుంచి భక్తులు వచ్చారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, మే 12 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. ఆ తర్వాత పూల అలంకరణ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయం వద్ద ఏర్పాట్లను ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.